# వివేక చూడామణి - ఆచార్య శంకరులు

## I. జ్ఞానార్జనకు మార్గం – ఉపాయం

**శ్లో || సర్వవేదాంత సిద్ధాంత గోచరం తమగోచరం |**
**గోవిందం పరమానందం సద్గురుం ప్రణతోస్మ్యహం || 1**

**భావం:-** సర్వవేదాంత సిద్ధాంతగోచరుడు, ఇంద్రియాలకు మనస్సుకు అందనివాడు, పరమానంద స్వరూపుడు అయిన సద్గురువుకు, గోవిందునికి నమస్కరిస్తున్నాను.

**వ్యాఖ్య:-** ఏ గ్రంథాన్నైనా ప్రారంభించేటప్పుడు భగవత్స్మరణ చేస్తారు. వేదాంతగ్రంథాలను ప్రారంభించేటప్పుడు గురుస్మరణ చేయటం ఆచారం. పరమాచార్యులైన శంకరులవారు అటు భగవంతుని – ఇటు గురుదేవులను స్మరణచేస్తూ గ్రంథాన్ని ప్రారంభిస్తున్నారు. ఎంత గొప్పవ్యక్తి అయినా సరే తన గురుదేవుని గౌరవించాలని శంకరుల ఆంతర్యం. అందుకే ఆచరణలో చూపారు. నిజంగా ఇక్కడ గురువు కన్న శిష్యుడే మిన్న. శంకరుల గురువు గోవిందపాదాచార్యులు. ఆయన మాండూక్యకారికలు వ్రాసిన గౌడపాదులవారి శిష్యులు. ఈ శ్లోకంలో శంకరులు గోవిందం అంటూ తమ గురుదేవులనూ స్మరించారు, పరమాత్మనూ స్మరించారు. పరమానందస్వరూపులైన సద్గురువు గోవిందపాదాచార్యులకు నమస్కరించుచున్నాను అని ఒక అర్థం. పరమానందస్వరూపులైన సద్గురువులకు - గోవిందునకు నమస్కరిస్తున్నానని మరొక అర్థం.

సద్గురువు ఎలాంటివారో చెబుతున్నారు. ఆయన పరమానంద స్వరూపుడు. ఆయన దేహాన్నిగాక ఆయన స్వరూపాన్ని

స్మరిస్తున్నారు. సద్గురువు పరమానందస్వరూపుడు గనుక ఆయన ఇంద్రియాలకు అగోచరుడు. ఇంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, చర్మం, నాలుక) స్థూలశరీరాన్ని - వస్తువులను చూడగలుగుతాయే గాని సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను దర్శించలేవు. అలాగని దిగులు చెందాల్సిన పనిలేదు. ఆయన సర్వవేదాంతసిద్ధాంతగోచరుడు. వేదాంతములంటే వేదాలకు అంతములోనివి - ఉపనిషత్తులు. ఆత్మతత్త్వాన్ని ఉపనిషత్తుల వాక్యాల ద్వారా జ్ఞాననేత్రంతో దర్శించగలం. కనుక మనమూ ఈ శరీర మనోబుద్ధుల తాదాత్మ్యాన్ని వదలుకొని వీటికి దూరంగా జరిగి మన స్వస్థితిలో ఉండి ఆత్మను అనుభవపూర్వకంగా దర్శించవచ్చు. అట్టి సద్గురుదేవులకు నమస్కారం అని మంగళాచరణం చేస్తున్నారు -

**శ్లో ॥ జంతూనాం నరజన్మ దుర్లభ మతః పుంస్త్వం తతో విప్రతా**
**తస్మాత్ వైదికధర్మ మార్గపరతా విద్వత్వమస్మాత్పరం |**
**ఆత్మానాత్మవివేచనం స్వనుభవో బ్రహ్మాత్మనా సంస్థితిః**
**ముక్తిర్నో శతకోటి జన్మసుకృతైః పుణ్యైర్వినా లభ్యతే ॥ 2**

**భావం:-** జీవకోటిలో మానవజన్మ దుర్లభమైనది. పురుషత్వం, విప్రత్వం అరుదుగా లభిస్తాయి. అన్నీ లభించినా వేదాలు చూపిన ధర్మమార్గంలో నడవాలనే బుద్ధి కలగటం మరీ అరుదు. వీటన్నింటితో పాటు శాస్త్రంలో చెప్పబడిన లోతైన భావాలను తెలుసుకోగల సునిశిత బుద్ధి లభించటం గొప్పవరం. ఆత్మ ఏమిటో అనాత్మ ఏమిటో తెలుసుకొని ఆత్మానుభూతిని పొందటం, తరువాత ఆత్మ బ్రహ్మము ఒక్కటేనని గ్రహించటం గొప్ప అదృష్టం. శతకోటి జన్మల సుకృతం, పుణ్యఫలం ఉంటే తప్ప ముక్తి అనేది లభించదు.

